దిగొస్తున్న కూరగాయల ధరలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కొన్నినెలల నుంచి పెరుగుతూ వచ్చిన కూరగాయల ధరలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. నవంబరులో వచ్చిన వరదలకు కూరగాయల పంటలన్నీ కొట్టుకుపోయాయి. ఆ తర్వాత వేసిన పంటలు జనవరిలో కొంతమేర అందుబాటులోకి వచ్చినా దిగుబడులు తగ్గడంతో ధరలు ఎగబకాయి. జనవరిలో వేసిన పంటలకు వాతావరణం అనుకూలించడంతో అధిక దిగుబడులు వస్తుండడంతో ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. పది రోజులకు ముందు వరకు వంకాయలు కేజీ 30-40 రూపాయలు పలికాయి. ఇప్పుడు కేజీ రూ.12 లకు తగ్గింది. టమోట కేజీ రూ.18, క్యాబేజీ రూ.20, క్యారెట్ రూ.30, దొండకాయలు రూ.30, బంగాళ దుంపలు రూ.30-రూ40, గోరు చిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.32, కీరదోస రూ.40, ఫ్రెంచ్‌బీన్స్, క్యాప్సికం కేజీ రూ. 80 నుంచి 60కి దిగివచ్చాయి. కొత్తిమీర కట్ట రూ.25 నుంచి రూ.15కు తగ్గగా ఆకుకూరలు కట్ట రూ.10కి అందుబాటులో ఉన్నాయి. చిక్కుడు కేజీ రూ.80కి చేరుకుని ఇప్పుడు రూ.32కు దిగొచ్చాయి. కంద రూ.72 పలుకుతోంది. బెండకాయలు రూ.36, పచ్చిమిర్చి రూ.24, బీరకాయలు రూ.48లకు చేరుకున్నాయి. మార్కెట్‌లో నిత్యా వసర వస్తువుల ధరలు పప్పులు, నూనెల ధరలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూరగాయల ధరలు దిగి రావడంతో సామాన్యులకు ఊరట కలిగినట్టే.



నేడు ఐఎస్.జగన్నాథపురంలో శ్రీలక్ష్మీనారసింహుడి కల్యాణం

ద్వారకాతిరుమల శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన మండలంలోని ఐఎస్. జగన్నాథపురంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనారసింహస్వామి కల్యాణం సోమవారం వైభవంగా జరగనుంది. ఈ మేరకు ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలందుకున్న స్వామివారిని చిత్రంలో చూడవచ్చు.

7



అంతర్వేదిలో ఘనంగా గ్రామోత్సవం

అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో భక్తులు బారులు తీరారు. స్వామివారికి పాలమూరి వారి వార్షిక అభిషేకం, అన్నపర్వత మహా నివేదన సమర్పించారు. సాయంత్రం గజ వాహనంపై ఊరేగింపు, రాత్రి పొన్నవాహనంపై గ్రామోత్సవం జరిపారు.

కొలిక్కి తెచ్చేలా!



వంకావారిగూడెం పంచాయతీ వాడపల్లి కాలనీలో నిర్మించిన ఇళ్లు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రభుత్వం నిర్దేశించినట్టుగా రానున్న రెండేళ్లలో పూర్తి కావాలి. దీనికంటే ముందు ముంపు గ్రామాలను ఖాళీ చేయించి అక్కడి వారందర్నీ పునరావాస కాలనీలకు తరలించాలి. గత ఏడేళ్లుగా నిర్వాసిత గ్రామాలను ఖాళీ చేయిస్తున్నట్టు ప్రకటనలు వెలువడుతూనే వచ్చాయి. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు సైతం సాగలేదు. ఈక్రమంలో ఇప్పటికే వివిధ కాలనీల్లో మిగిలిపోయిన నిర్మాణాలన్నింటినీ పూర్తి చేసేందుకు తిరిగి టెండర్లు, దీని నిమిత్తం రూ.920 కోట్లు కేటాయించేందుకు తాజాగా రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదముద్ర వేసింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పోలవరం నిర్వాసిత కాలనీలకు హంగులు

- ఇళ్లు పూర్తి చేసేందుకు మళ్లీ టెండర్లు
- ఇంతకు ముందు నిలిచిన పనులకు శ్రీకారం
- రూ.920 కోట్లకు మంత్రివర్గ ఆమోదం
- ముంపు గ్రామాలను ఖాళీ చేసేందుకు కసరత్తు

పోలవరం నిర్వాసిత కాలనీల్లో ఇప్పటికే ఆగిన ఇళ్లలన్నింటిని త్వరలోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో కాలనీల నిర్మాణానికి కుదిరిన ఒప్పందాలను రద్దు చేసుకుని ఇప్పుడు తాజాగా మరోమారు టెండర్లు పిలిచి టెండర్లు పిలవాలని సంకల్పించింది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పరిధిలో కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, వీఆర్‌పురం, చింతూరు, కూనవరం, ఎటపాక వంటి ఏడు ముంపు మండలాలు ఉన్నాయి. వీటిలో ముంపు గ్రామాల నుంచి నిర్వాసితులను తరలించడానికి ప్రయత్నిస్తూనే వచ్చారు. వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం మండలాలు ఏలూరు జిల్లా పరిధిలో ఉండగా, మిగతా మండలాలన్నీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణం ఆరంభమైన నాటి నుంచి ఈ మండలాలన్నింటిలోను ఏదోక వివాదం తొంగి చూస్తూనే వచ్చింది. వాస్తవానికి 2014-19 మధ్య నిర్వాసిత కాలనీల్లో నిర్మాణాలు శరవేగంగా సాగాయి. అప్పట్లో ప్రాజెక్టు నిర్మాణ పనులు దాదాపు 70 శాతం మేర పూర్తవ్వడంతో కాలనీలకు కొంత వన్నె తెచ్చి నిర్వాసితులను అక్కడికి తరలించాలని అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. 2019-24 మధ్య జగన్ ప్రభుత్వ హయాంలో కాలనీల్లో పెండింగ్ పనులను గాలికొదిలేశారు. కొందరు నిర్వాసితులు తమకు ఇవ్వాల్సిన పరిహారం, జగన్ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని అప్పటి వరకు కాలనీల్లోకి వెళ్లబోమని భీష్మించారు. ఇప్పటికీ నిర్వా సిత కాలనీల్లో నిర్మాణం పూర్తికాని ఇళ్లు వందల్లోనే ఉన్నాయి. కుక్కునూరు మండలంలో కివ్వాక, దాచారం, వెంకటాపురం, మర్రిపాడుల్లో నిర్వాసిత కాలనీల్లో ఇంకా అనేక ఇళ్లను నిర్మించాల్సి ఉంది. జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం పంచాయతీ పరిధిలో తెల్లవరం, రాచన్నగూడెం పంచాయతీలో శివగిరి, రౌతుగూడెం పంచాయతీలో తాటికొట్కూరుగొమ్మి, జీలుగుమిల్లిలో ఎర్రవరం, వంకావారిగూడెం పంచాయతీలో వాడపల్లి, కామయ్యపాలెంలో మామిడిగొంది, టి.అంకంపాలెంలో టేకూరు, కొరుటూరు, దబ్బగూడెంలో రేపాకగొమ్మి వంటి నిర్వాసిత కాలనీలుండగా వీటన్నింటిల్లోను ఇళ్లైతే నిర్మించారు కానీ అక్కడక్కడ వసతుల్లేని పెండింగ్ నిర్మాణాలు ఉన్నాయి. వీటన్నంటిని ఒక కొలిక్కి తేబోతున్నారు.



వాడపల్లి కాలనీ ప్రధాన రోడ్డు ఇలా..



వాడపల్లి కాలనీలో అసంపూర్తి పాఠశాల భవన నిర్మాణం చుట్టూ పెరిగిన తుప్పలు

ఇప్పుడేమి జరగబోతుందంటే..?

ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఒకవైపు డయాఫ్రం వాల్ నిర్మాణం అనుకున్న లక్ష్యం మేరకు ఈ ఏడాదంతానికి పూర్తి కానుంది. రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలకు కేంద్రం సాయం తోడై మరింత ప్రోత్సాహాన్నిస్తోంది. తాజాగా బడ్జెట్‌లోను, అంతకు ముందు పోలవరం నిర్మాణానికి ఎవరూ ఊహించని విధంగా నిధులు కేటాయించారు. 2027 నాటి కల్లా పనులు సంపూర్తి చేయడానికి కాంట్రాక్టు ఏజెన్సీలకు తగిన నిర్దేశం చేశారు. ఈలోపే ముంపు గ్రామాల్లోని నిర్వాసిత కుటుంబాలన్నింటిని సహాయ,పునరావాస కాలనీలకు తరలించాలన్న ఇంకో లక్ష్యం ఉంది. ఏడు ముంపు మండలాల్లో ఇంతకముందే నిర్వాసిత కుటుంబాలకు 50 కాలనీల్లో 11 వేలకు పైగా పక్కా ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి గాను అప్పట్లో 1,618 కోట్ల వ్యయంతో ఒప్పందం చేసుకుని దీనిలో భాగంగా రూ.1,190 కోట్లు ఖర్చుపెట్టారు. ఇంకా మిగిలిన రూ.400 కోట్లకు పైగా పనులను గాలికొదిలేశారు. ఇప్పటికిప్పుడు ఈ పనులన్నింటిని తిరిగి ప్రారంభించాలంటే ఇంతకుముందు వ్యయం కంటే మరింత ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది. దీనికోసం దాదాపు రూ.700 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే పాత, కొత్త ప్రతిపాదనలంటూ కాలయాపన చేయడం తగదని భావించి, ఇప్పటివరకు ప్రభుత్వ పరంగా ఏవైతే కాలనీల నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నారో వాటన్నింటిని రద్దు చేయాలని నిర్ణయించారు. మిగతా పెండింగ్ పనులన్నింటిని పూర్తి చేసేందుకు దాదాపు రూ.920 కోట్ల వ్యయానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదముద్ర వేసింది. దీంతో స్వల్ప కాలిక టెండర్ల మేరకు పనులు చేపట్టి పూర్తి చేయ బోతున్నారు. సమస్త సౌకర్యాలు సమకూర్చి నిర్వాసిత కుటుంబాలు కాలనీలకు తరలి వచ్చే లా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

మద్యం షాపుల లాటరీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా

ఏలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మికుల ఉపకులాలకు కేటాయించి మద్యం దుకాణాల లైసెన్సులకు ఏలూరు చలసాని గార్డెన్స్‌లో ఈ నెల 10న ఉదయం జరగాల్సిన లాటరీ ప్రక్రియను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున తాత్కాలికంగా వాయిదా వేశామని జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. ఈ విషయాన్ని అభ్యర్థులంతా గమనించాలన్నారు. లాటరీ ప్రక్రియకు సంబంధించి తదుపరి షెడ్యూల్ రెండు, మూడు రోజుల్లో విడుదల చేస్తామని తెలిపారు.

అధికారితో..



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరు నగరంలోని డివిజన్‌లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజల అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లే కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి శ్రీకారం చుట్టింది. 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం ద్వారా మంగళవారం ఉదయం 11-12 గంటల మధ్య **70136 20539** నెంబరుకు ఫోన్ చేయండి. నగర పాలక సంస్థ పరిధిలోని డివిజన్‌లలో నెలకొన్న సమస్యలను ఏలూరు నగర కమిషనర్ భానుప్రతాప్ దృష్టికి తీసుకురండి. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటారు.

పట్టభద్రుల ఎన్నికల్లో రాజశేఖరంను గెలిపిద్దాం

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం మంత్రి ఏలూరులో పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఏలూరు జనసేన పార్టీ కార్యాలయాన్ని సందర్శించి విలేకరులతో మాట్లాడుతూ.. 'కూటమి అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖరం విజయానికి కృషి చేయాలి. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నాం. గత వైసీపీ ప్రభుత్వంలో పాలన గాడి తప్పింది. ప్రస్తుతం కూటమి పాలనలో సంక్షేమం వైపు అడుగులు వేస్తోంది. ఢిల్లీలో బీజేపీ గెలుపు శుభపరిణామం' అన్నారు. సోమవారం రాజశేఖరం నామినేషన్‌కు తరలి రావాల్సిందిగా కూటమి శ్రేణులకు పిలుపు నిచ్చారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ జోన్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఎం.ఆర్ పెదబాబు, జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, నారా శేషు, రాఘవయ్య చౌదరి, నగిరెడ్డి కాశీనరేష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, సాంబశివరావు, పేరాబత్తుల సత్యనారాయణ, కంచన విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 78 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా ఆదివారం జరిగిన పరీక్షకు 509 మంది విద్యార్థులకు గాను 431 మంది హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారని, పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు
ఇంటర్న్‌షిప్ అవకాశాలు



మార్కెట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో చాలా మంది ఇంజనీరింగ్ విద్యార్థులు వెనకబడుతుంటారు. ఇందుకు ప్రధాన కారణం ఉద్యోగానికి అవసరమైన స్కిల్స్‌ను నేర్చుకోకపోవడమే. అలాంటి వారికి ఇంటర్న్‌షిప్‌లు ఉపయోగపడుతుంటాయి. వీటి ద్వారా కాలేజీలో నేర్చుకున్న థియరిటికల్ నాలెడ్జ్‌ని రియల్ వరల్డ్ సిట్యువేషన్స్‌కు అప్లై చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రొఫెషనల్ లైఫ్‌కి కావాల్సిన ఇన్‌సైట్స్ తెలుసుకోవడంలో ఇంటర్న్‌షిప్స్ ఉపయోగపడతాయి. అకడమిక్‌కి, ప్రొఫెషనల్ లైఫ్‌కి కావాల్సిన స్కిల్స్ తేడా వారికి అవగతమవుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలు అందించే కొన్ని ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్ ఇవి. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

నేషనల్ రెన్యువబుల్ ఎనర్జీ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్

కేంద్ర పునరుత్పాదన మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటర్న్‌షిప్ ఇది. ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, లా తదితర ప్రోగ్రామ్స్ చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మంత్రిత్వశాఖ అవసరాలను బట్టి సంవత్సరానికి రెండుసార్లు కూడా దీనిని ప్రకటిస్తారు. ఈ ఇంటర్న్‌షిప్ కాలపరిమితి రెండు నుంచి ఆరు నెలలు ఉంటుంది. నెలకు 15 వేల రూపాయలు ఉపకారవేతనం ఇస్తారు. https://mnre.gov.in/en/national-renewable-energy-internship-programme-2/

ఐఐటీ పాలక్కడ్ సమ్మర్ ఇంటర్న్‌షిప్

ఈ ఇంటర్న్‌షిప్ ఇంజనీరింగ్, సైన్స్, హ్యూమానిటీస్ విద్యార్థులకు ఉద్దేశించినది. మూడు లేదా నాలుగో సంవత్సరం చదువుతున్నవారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆరువారాల ఈ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన రీసెర్చ్ ట్రైనింగ్ ఉంటుంది. 12000/- స్టయిఫండ్ కూడా ఇస్తారు. 2025 మార్చి 15లోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://sun.iitpkd. ac.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

డిజిటల్ ఇండియా ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఈ ఇంటర్న్‌షిప్‌ను మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందిస్తుంది. ఇంజనీరింగ్ యూజీ, పీజీ, లా చేస్తున్న విద్యార్థులు దీనికి అర్హులు. ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునే ముందు రాసిన పరీక్షలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. రెండు నెలల కాలవ్యవధి ఉంటుంది. నెలకు పదివేల రూపాయల స్టయిఫండ్ ఇస్తారు. www.meity.gov.in

వాద్వానీ, మద్రాస్ ఐఐటీ సమ్మర్ ఇంటర్న్‌షిప్స్

వాద్వానీ స్కూల్ ఆఫ్ డేటా సైన్స్ అండ్ ఏఐ, మద్రాస్ ఐఐటీ కలిసి ఉమ్మడిగా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. ఇంజనీరింగ్ లేదా సైన్స్ బ్రాంచ్‌ల్లో యూజీ ప్రోగ్రామ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు, పీజీ అయితే మొదటి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ కాల వ్యవధి మూడు నుంచి ఆరు నెలలు ఉంటుంది. వ్యక్తిగతంగా హాజరయి పూర్తి చేయాల్సిన ఇంటర్న్‌షిప్ ఇది. వీరికి స్టయిఫండ్ కూడా అందజేస్తారు. దరఖాస్తులు 2025 ఫిబ్రవరి 15లోపు పంపుకోవాలి. https://wsai.iitm.ac.in/2025/01/05/wsai-summer-internships-2025/

టెక్ ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్‌కు చెందిన 'టెలీకామ్ ఇంజనీరింగ్ సెంటర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోంది. ఆరు నెలలపాటు ఇది ఉంటుంది. అవసరమైన పక్షంలో దీనిని ఒక సంవత్సరం వరకు పొడిగించుకోవచ్చు. ఇంటర్న్‌షిప్‌లో మొత్తం రూ.15,000స్టయిఫండ్ ఇస్తారు. https://www.myscheme.gov.in/schemes/tecis#details

దిక్సూచి
DIKSUCHI

BITSAT 2025 నోటిఫికేషన్ విడుదల

దేశంలోని ఇంజనీరింగ్ విద్యను అందించే ప్రతిష్ఠాత్మక సంస్థలో 'బిర్లా ఇన్‌స్టిట్యూట్' (బిట్స్) ఒకటి. పిలానీ, గోవా, హైదరాబాద్‌ల్లో బిట్స్‌కు క్యాంపస్‌లు ఉన్నాయి. ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థులు జేఈఈ, తమ రాష్ట్రాల ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లతో పాటుగా దీనిని కూడా రాస్తుంటారు.

బిట్స్ ఎంట్రెన్స్ స్కోరుకు కూడా కొన్ని ఇతర సంస్థలు అడ్మిషన్ ఇస్తున్నాయి. ఇంటర్మీడియేట్ అర్హతతో బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరవచ్చు. ఇంటర్ సబ్జెక్టులతోపాటు ఈ ఎంట్రెన్స్‌లో ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్‌ల్లో కూడా ప్రశ్నలు అడుగుతారు. జేఈఈ స్థాయిలో అత్యుత్తమంగా స్కోరు సాధించిన విద్యార్థులకు ఇక్కడ సీటు లభిస్తుంది. 390కి కనీసం 240 మార్కులు సాధించిన వారికి సీటు దొరికే అవకాశం ఉంది. బీఫార్మసీకి అయితే ఇంకా తక్కువ స్కోరుకు కూడా దొరుకుతుంది.

బిట్స్ ఎంట్రెన్స్ 2025 పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుంది.

- సెషన్-1 ఎంట్రెన్స్ 2025 మే 26 తేదీ నుంచి 30వ తేదీ వరకు.
- సెషన్-2 ఎంట్రెన్స్ 2025 జూన్ 22 తేదీ నుంచి 26 తేదీ వరకు.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 ఏప్రిల్ 18

ఆసక్తి గల అభ్యర్థులు రెండు సెషన్లు లేదా ఒక్క సెషన్ అయినా రాయవచ్చు. రెండింటిలో అత్యుత్తమంగా సాధించిన మార్కులనే ఫైనల్ స్కోరుగా పరిగణనలోకి తీసుకుంటారు.


కోర్సులు:

బీఈ: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎన్విరాన్‌మెంటల్ అండ్ సస్టయినబిలిటీ.

బీఫార్మసీ:

ఎమ్మెస్సీ: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయలాజికల్ సైన్సెస్, ఎకనామిక్స్, సెమీ కండక్టర్ అండ్ నానో సైన్స్, జనరల్ స్టడీస్.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం,



సబ్జెక్టులు: ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి.
పార్ట్-1: ఫిజిక్స్ 30,
పార్ట్-2: కెమిస్ట్రీ 30,
పార్ట్ 3
ఏ. ఇంగ్లీష్ ప్రొఫిషియన్సీ 10,
బి. లాజికల్ రీజనింగ్ 20.
పార్ట్-4: మేథ్స్/బయాలజీ(బీఫార్మసీ కోసం) 40 ప్రశ్నలు ఉంటాయి.

పరీక్ష విధానం: పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. మొత్తం 130 ప్రశ్నలను మూడు గంటల్లో పూర్తిచేయాలి. అయితే సమయానికి సంబంధించి సెక్షన్ల వారీ నిబంధనలు లేవు. కానీ నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతీ సరైన జవాబుకు మూడు మార్కులు, తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

SCHOLARSHIP ALERT

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less) ***Last Date:*** 15-02-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/TCPS27

JK Tyre Shiksha Sarthi

Description: JK Tyre & Industries Pri vate Limited invites applications from the daughters of heavy vehicle drivers who are pursuing technical or non-technical undergraduate or diploma courses and reside in select locations.
Eligibility: Female students who are daughters of heavy vehicle drivers and pursuing technical or non-technical undergraduate or diploma courses are eligible to apply. Students must have received a minimum of 55% marks in their previous academic year. The annual family income of applicants must be less than or equal to INR 5,00,000. Applicants must be residents of Rajasthan, Madhya Pradesh, Uttara khand, Karnataka, or Tamil Nadu.
Prizes & Rewards: One-time scholarship:
Technical Undergraduate Courses: INR 25,000
Non-Technical Undergraduate Courses: INR 15,000 ***Diploma Courses:*** INR 15,000
Last Date to Apply: 15-02-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/JKTS1

Charpak Bachelor's

Description: Charpak Bachelor's Scholarship 2025 is an opportunity offered by the French Government to Indian students who wish to pursue a full-time undergraduate degree in one of the institutions in France.
Eligibility: Open for Indian nationals or OCI card holders who are 23 years old or younger at the time of application. Applicants must have completed secondary school in India and have applied for a bachelor's degree program starting on 1st September 2025. Students must have never previously studied at an educational institution in France.
Prizes & Rewards: The scholarship offers a monthly living allowance of 860 euros and other benefits.
Last Date to Apply: 28-02-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/CBSS3

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విజయ్ సినిమాలో సంజయ్‌దత్?

విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారనే వార్త టాలీవుడ్‌లో ప్రచారమవుతోంది. అంతేకాదు 'ద మమ్మీ' యాక్టర్ అర్నాల్డ్ వోస్లూ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నాడనే వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలపై మేకర్స్ ఇప్పటివరకూ స్పందించలేదు. కాగా, ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఓ సరికొత్త పాత్రలో కనిపించనున్నాడట. 1854-78 మధ్య కాలంలో జరిగే కథ కాబట్టి, సినిమాలో చాలా వేరియేషన్స్ ఉంటాయని తెలుస్తోంది. చిత్ర షూటింగ్ ఈనెల మూడో వారంలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. మొదటి షెడ్యూల్‌లో విజయ్ దేవరకొండ ఎంట్రీ సీన్‌ను చిత్రీకరించనున్నట్లు టాక్. నాని హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో వచ్చిన 'శ్యామ్ సింగరాయ్' చిత్రం విజయవంతమైంది. దీంతో విజయ్ దేవరకొండ సినిమాపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.



ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విజయ్ తన తల్లితో కలసి హాజరయ్యారు. వారు త్రివేణి సంగమంలో ఆదివారం పుణ్యస్నానాలు చేసారు.

త్వరలో వీడీ12 టైటిల్ టీజర్

విజయ్ దేవరకొండ హీరోగా గౌతం తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న వీడీ12(వర్కింగ్ టైటిల్) టైటిల్ టీజర్ ఈనెలలోనే వెలువడనున్నట్లు వార్తలొస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా హిందీ టీజర్‌కు రణ్‌బీర్ కపూర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. అదేవిధంగా తెలుగుకు ఎన్టీఆర్, తమిళ్‌కు ధనుష్ వాయిస్ ఓవర్ ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

నాటి ప్రజారాజ్యమే నేటి జనసేన



- తొలిసారి 'జై జనసేన' అంటూ నినదించిన చిరంజీవి
- ఒక్కోసారి కొన్ని సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు
- 'పుష్ప 2' ఘన విజయాన్ని స్వాగతిస్తున్నా
- ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్

"ప్రజారాజ్యం పార్టీ జనసేనగా రూపాంతరం చెందింది. అందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు అంతా జనసేనే. జై జనసేన' అంటూ నినదించి మెగా అభిమానులను ఉత్సాహపరిచారు చిరంజీవి. విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన 'లైలా' చిత్రం ఈనెల 14 న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపైన ఉన్న విష్వక్‌సేన్ తండ్రి కరాటే రాజుతో తన అనుబంధం గురించి ప్రస్తావిస్తూ చిరంజీవి పై వ్యాఖ్యలు చేశారు. 'మేం ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు రాజకీయంగా ఎదగాలనే తన కోరికను కరాటే రాజు నా దగ్గర ప్రస్తావించాడు. దాంతో ప్రజారాజ్యం తరపున అవకాశం ఇచ్చాం. కానీ అప్పట్లో పరిస్థితులు ఇంకోలా ఉన్నాయి' అని చిరంజీవి చెప్పారు. అలాగే మేనల్లుడు అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' విజయం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. "పుష్ప 2' పెద్ద హిట్టయింది. అందుకు నేను గర్విస్తున్నా. ఒక్కోసారి కొన్ని సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు. కానీ ఒక సినిమా బాగా ఆడితే దాన్ని ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరూ హర్షించాలి' అన్నారు.

విష్వక్‌ను బాలకృష్ణ మనిషి అన్నారు

"నా బాల్యంలో ఎన్టీఆర్, ఏఎన్నార్ అభిమానులు రక్తం వచ్చేలా కొట్టుకోవడం చూశాను. ఆ సంఘటన ప్రభావంతో నేను సినిమాల్లోకి వచ్చాక మా హీరోల మధ్య సఖ్యత కోసం కృషి చేశాను. 'విష్వక్సేన్ ఫంక్షన్‌కు వెళ్తున్నావా? అతను మన మనిషి కాదు, బాలకృష్ణ మనిషి. అప్పుడప్పుడూ 'తారక్' అని కూడా అంటాడు. ఆ కార్యక్రమానికి వెళ్లొద్దు" అని కొందరు నాతో అన్నారు. మనుషులన్నాక వేరేవాళ్ల మీద ప్రేమ, అభిమానం ఉండకూడదా? అభిమానం పర్సనల్. జిహ్వకో రుచి అన్నట్లు యాక్టర్‌గా కొంతమంది కొందరికి కనెక్ట్ అవుతారు. దాన్ని మనమంతా అంగీకరించాలి. రామ్ చరణ్‌కు సూర్య అంటే చాలా ఇష్టం. అంతమాత్రాన వాడితో నేను కలసి ఉండకూడదా? ఇక నుంచైనా మా గురించి ఆ కాంపౌండ్, ఈ కాంపౌండ్ అంటూ మాట్లాడరనే అనుకుంటున్నాను. ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్' అని చెప్పారు. 'లైలా' సినిమాతో విష్వక్‌సేన్, దర్శకుడు రామ్ నారాయణ్, నిర్మాత సాహూ గారపాటి పెద్ద విజయాన్ని అందుకోవాలని చిరంజీవి ఆకాంక్షించారు. 'ఇది నా కెరీర్‌లో స్పెషల్ మూవీ. జనాల్ని నవ్వించాలని డిసైడ్ అయ్యాను ' అని విష్వక్‌సేన్ అన్నారు. లైలా లాంటి పాత్ర చేయడానికి విష్వక్ తప్ప మరో హీరో ముందుకురాడు అని సాహూ గారపాటి అన్నారు. విష్వక్ ఈ సినిమాను అంగీకరించడమే నాకు పెద్ద బహుమతి అని . రామ్ నారాయణ్ చెప్పారు.



పుష్ప జీవితాంతం గుర్తుంటుంది

అల్లు అర్జున్

"పుష్ప' సినీ ప్రయాణంలో ఐదు నిమిషాల నుంచి ఐదేండ్ల వరకూ భాగమైన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు. ఈ సక్సెస్ క్రెడిట్ దర్శకుడు సుకుమార్‌తో పాటు సినిమా కోసం కష్టపడి పనిచేసిన టీమ్‌కు దక్కుతుంది. ఆయన సీన్ చెప్తుంటే పిచ్చెక్కిపోతుంది. ఈ సినిమా కోసం వెచ్చించిన ఐదేళ్లు నాకెంతో ప్రత్యేకం. ఈ సినిమా అందరికీ జీవితాంతం గుర్తుండిపోతుంది. 'పుష్ప 3' ఓ అద్భుతం" అని 'పుష్ప 2' థ్యాంక్స్ మీట్‌లో అల్లు అర్జున్ అన్నారు. దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ "మైత్రీ మూవీస్ సీఈఓ చెర్రీ సలహాతోనే 'పుష్ప' మూడు భాగాలుగా తయారైంది. ఈ విజయం మైత్రీ మూవీ మేకర్స్‌కి అంకితం చేస్తున్నాను. ఈ ప్రపంచంలో నన్ను ఎక్కువగా నమ్మే వ్యక్తి అల్లు అర్జున్" అని చెప్పారు. "ఈ సినిమా విజయం ఎంతో మంది కష్టంతో వచ్చింది. ఈ విజయానికి కారణమైన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు" అని నిర్మాత యలమంచిలి రవిశంకర్ అన్నారు. "సినిమా అంచనాలను మించి కలెక్ట్ చేస్తుందని అనుకున్నాం కానీ.. ఇంత ఘనవిజయం సాధిస్తుందని అనుకోలేదు" అని నిర్మాత నవీన్ యెర్నేని తెలిపారు.

'లూసిఫర్ 2'లో హాలీవుడ్ యాక్టర్లు



మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్ 2 ఈ ఎంపురాన్'. 'లూసిఫర్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. మార్చి 27న పాన్ ఇండియా స్థాయిలో మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఆశీర్వాద్ సినిమాస్, లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మంజు వారియర్, టొవినో థామస్, ఇంద్రజిత్ సుకుమారన్, జైస్ జోస్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ జైస్ జోస్ పోషించిన జేవియర్ పాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. జైస్ జోస్ ఈ మూవీ చిత్రీకరణ అనుభవాలను వీడియో ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. కాగా, ఈ చిత్రం గురించి ఓ ఆసక్తికర అప్‌డేట్ వైరల్ అవుతోంది. ఈ సినిమాలో కొందరు ఇంటర్నేషనల్ యాక్టర్స్ నటిస్తున్నట్టుగా గతంలో వార్తలు వెలువడ్డాయి. అయితే ఇప్పుడు యూకేకు చెందిన ఇద్దరు యాక్షన్ స్టార్స్ నటించారనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. హాలీవుడ్‌కు చెందిన ఓ ఏజెన్సీ ఈ సమాచారాన్ని వెల్లడించింది. కొరియన్ అమెరికన్ నటులు రిక్ యూన్, ఆండ్రియా టి వాడర్ కూడా ఈ సినిమాలో నటించనున్నట్లు ఆ ఏజెన్సీ తొలుత సోషల్ మీడియాలో షేర్ చేసి ఆ తర్వాత డిలీట్ చేసినట్లు మాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



ఆ సినిమాను అంగీకరించారా?

హీరోయిన్ శ్రీలీల వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. ఇప్పటికే పవన్‌కల్యాణ్‌తో 'ఉస్తాద్ భగత్‌సింగ్', రవితేజతో 'మాస్ జాతర', నితిన్‌తో 'రాబిన్‌హుడ్', శివకార్తికేయన్‌తో 'పరాశక్తి' సినిమాల్లో నటిస్తున్నారీ బ్యూటీ. అయితే, ఆమెకు మరో అసక్తికరమైన ప్రాజెక్ట్‌లో నటించేందుకు ఆఫర్ వచ్చిందని సమాచారం. 2023లో విడుదలై విజయవంతమైన 'మంగళవారం' సినిమా సీక్వెల్‌లో ఆమె నటిస్తున్నట్లు టాక్. తొలి భాగంలో కథానాయికగా నటించిన పాయల్ రాజ్‌పుత్ ఈ చిత్రం సీక్వెల్‌లో నటించట్లేదని తెలుస్తోంది. ఆమె స్థానంలో నటించేందుకు శ్రీలీలకు ఆఫర్ వచ్చిందట. ఇందుకు ఆమె అంగీకరించారా లేదా తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకూ ఆగాల్సిందే. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు దర్శకుడు అజయ్ భూపతి. ఈ ఏడాదిలోనే సీక్వెల్‌ను పట్టాలెక్కించే ఆలోచనలో ఉన్నారు మేకర్స్.

నటుడిగా నా స్థాయిని పెంచుతుంది

- రాగ్ మయూర్



'సినిమా బండి, కీడా కోలా' తదితర చిత్రాలతో నటుడిగా రాగ్ మయూర్ చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవలే 'విడుదలైన గాంధీ తాత చెట్టు' చిత్రంలో విలన్‌గా తన నటనకు మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకొన్నారు. ప్రస్తుతం ఆయన 'గరివిడి లక్ష్మి' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా రాగ్ మయూర్ మాట్లాడుతూ 'ఫహద్ ఫాజిల్, రాజ్‌కుమార్ రావు లాంటి నటులు నాకు ఆదర్శం. వారిలా ముందు మంచి నటుడిగా నిరూపించుకొని ఆ తర్వాత హీరోగా ఎదగాలనేది నా ఆలోచన. అందుకే కెరీర్ ఆరంభం నుంచి ఎక్కువగా నటనకు ఆస్కారమున్న పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ వస్తున్నాను. నేను హీరోగా నటిస్తున్న 'గరివిడి లక్ష్మి' చిత్రం గ్రామీణ నేపథ్యమున్న ప్రేమకథతో తెరకెక్కుతోంది. నటుడిగా ఇది నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమవుతుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో జరిగే కథ ఇది. అక్కడి వేషభాషలను అవగాహన చేసుకునేందుకు కొన్నాళ్లు అక్కడే గడిపాను. 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నా పాత్రకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి చక్కని ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది' అని చెప్పారు.

అజిత్ కారుకు మళ్లీ ప్రమాదం



పోర్చుగల్ కార్ రేస్ పోటీల కోసం శిక్షణ పొందుతున్న హీరో అజిత్ కారు మరోమారు ప్రమాదానికి గురైంది. ఈ విషయాన్ని అజిత్ ఆదివారం వెల్లడించారు. 'నా అభిమానులు మాత్రమే కాకుండా, నేను ఏం చేయబోతున్నానో తెలుసుకునేందుకు అమితాసక్తితో ఎదురు చూస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ రోజు కూడా శిక్షణలో నా కారు స్వల్ప ప్రమాదానికి గురైంది. దాన్ని మెకానిక్ బృందం రిపేర్ చేసింది' అని ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కాగా, ఇటీవల దుబాయ్ వేదికగా జరిగిన 24హెచ్ కార్ రేస్ పోటీల కోసం శిక్షణ పొందుతుండగా, అజిత్ కారు ప్రమాదానికి గురైన విషయం తెల్సిందే. దీంతో ఆ పోటీల నుంచి అజిత్ తప్పుకున్నారు. అయినప్పటికీ అజిత్ కుమార్ రేసింగ్ టీం ఆ పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. దీంతో అజిత్ కుమార్‌కు 'లిబర్టీ ఆఫ్ ది గేమ్' అనే అవార్డును కూడా ప్రదానం చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)



దొడ్డిపట్లలో ఏటిగట్టు పనులపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

రూ.8 కోట్లతో ఏటిగట్టు పటిష్ఠం

పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు

యలమంచిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో రూ.8కోట్ల గోదావరి ఏటిగట్టు పటిష్ఠం చేసే పనులు జరుగుతున్నాయి. పనులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం పరిశీలించారు. నాడు జగన్ పాలనలో గోదావరి ఏటిగట్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, నేడు చంద్రబాబు పాలనలో ఏటిగట్టును పటిష్ఠం చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పనులపై కన్జర్వేన్సీ అధికారులతో సమీక్ష అనంతరం దొడ్డిపట్లలో మంత్రి రామానాయుడు విలేకరులతో మాట్లాడారు. బూరుగుపల్లి వద్ద గోదావరి ఏటిగట్టుకు గండి పడితే 10 నుంచి 12 మండలాలు నీట మునిగే పరిస్థితులు ఎదురవుతాయని, నివారణకు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.6కోట్లు నిధులతో గ్రోయిన్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. 2019- 24 జగన్ ప్రభుత్వంలో కనీసం రూపాయి పని, తట్ట మట్టి వేసిన దాఖలాలు లేకపోవడంతో వరద సమయంలో ప్రజలు ముంపుభయానికి గురయ్యారన్నారు. వరద సమయంలో ఏటిగట్టు బలహీనంగా ఉన్నచోట్ల ఆయా గ్రామాల ప్రజలు, యువకులు రాత్రింబవళ్లు గస్తీకాసి.. సర్వేబాదులు, ఇసుక బస్తాలు వేసుకుని గ్రామాలను ముంపునుంచి కాపాడుకున్నారన్నారు. జగన్ ప్రభుత్వం చేతులెత్తేస్తే ప్రజలే తమను తాము కాపాడుకున్నారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. నిధుల సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ఏటిగట్టును పటిష్ఠం చేసేందుకు రూ.8కోట్లు నిధులు మంజూరుచేశారని మంత్రి రామానాయుడు వివరించారు. ఆనాడు జగన్‌కు 151 సీట్లు ఇచ్చి అధికారం కట్టబెడితే అన్ని రంగాలను, వ్యవస్థలను సర్వనాశనం చేశాడన్నారు. నేడు కష్టాల మధ్య కూడా అభివృద్ధి, సంక్షేమం దిశగా చంద్రబాబు విజన్, పవన్‌కల్యాణ్ తోడు, మోదీ అండతో సుపరిపాలన అందిస్తున్నారని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడెక్కి పోరాటంచేస్తే గానీ వరదసాయం అందేదికాదని, నేడు కూటమి ప్రభుత్వంలో వరదనీరు గడప వద్దకు వస్తుందని తెలిసిన వెంటనే సాయం అందించామని మంత్రి రామానాయుడు తెలిపారు. రాష్ట్రంలో ఇరిగేషన్ అత్యవసర పనుల నిమిత్తం చంద్రబాబు మంజూరుచేసిన రూ.320 కోట్ల నిధుల పనులను మార్చి నెలాఖరులోగా పూర్తయ్యేలా దృష్టిపెట్టామన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసిన ఏటిగట్లను బలోపేతం చేయడం, మురుగుకాలువల్లో పూడికతీత పనులు, గేట్లు, లాకులు, షట్టర్లు, లాకులు, రోప్‌లు వంటి అత్యవసర పనులను సరిచేస్తున్నామన్నారు. నాడు ఇరిగేషన్‌శాఖలో 12ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ప్రమోషన్లకు ఆమోదముద్ర వేసి ఉద్యోగుల గౌరవాన్ని కాపాడుతున్నామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ ప్రేరేపితంగా 386 మంది ఇరిగేషన్ ఉద్యోగులపై విజిలెన్స్ కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతుంటే వాటి నుంచి ఉద్యోగులను విముక్తులను చేశామని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు బోనం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, రుద్రరాజు సత్యనారాయణరాజు, చిలుకూరి బాలాజీ, బొప్పన హరికిషోర్, చిట్టూరి ఆంజనేయులు, చేగొండి రవిశంకర్, దేగల సత్తికొండ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు అంబికా థియేటర్‌లో ప్రేక్షకులతో మాట్లాడుతున్న హీరో నాగ చైతన్య

ఏలూరులో తండేల్ చిత్ర యూనిట్ సందడి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల దయనీయ పరిస్థితిని అద్దంపట్టే విధంగా తెరకెక్కించిన తండేల్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించారని హీరో నాగ చైతన్య, దర్శకుడు చందు మొండేటి అన్నారు. చిత్ర యూనిట్ సభ్యులు ఆదివారం నగరంలో సందడి చేశారు. అక్కినేని హీరో నాగచైతన్య, సాయిపల్లవి హీరోయిన్‌గా నటించిన చిత్రంలో దేశభక్తి, లవ్‌స్టోరీ ప్రేక్షకులను అలరిస్తోంది. చిత్రం విజయయాత్రలో భాగంగా హీరో నాగచైతన్య, డైరెక్టర్ చందు మొండేటి ఏలూరు అంబికా థియేటర్‌లో మ్యాట్నీషోలో సందడి చేశారు. హీరో నాగ చైతన్య మాట్లాడుతూ రెండేళ్ల కష్టం చిత్రం విజయంతో మర్చిపోయామన్నారు. ఇంతటి అఖండ విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్రంలోని పలు డైలాగులు చెప్పి ప్రేక్షకులను అలరించారు. డైరెక్టర్ చందు మొండేటి మాట్లాడుతూ అన్ని థియేటర్లలో విజయవంతంగా ఈ చిత్రం ప్రదర్శించడం సంతోషంగా ఉందన్నారు. తొలుత ప్రముఖ నిర్మాత అంబికాకృష్ణ యూనిట్ సభ్యులకు ఘనస్వాగతం పలికారు. తాత అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్ఆర్) తండ్రి నాగార్జున పేరును నాగచైతన్య నిలబెడుతున్నారని ప్రశంసించారు. నాగచైతన్యతో సెల్ఫీ కోసం యువకులు ఎగబడ్డారు. నాగచైతన్య అభిమాన సంఘం భారీ గజమాలతో సత్కరించారు.

భక్తులతో కిటకిటలాడిన ద్వారకాతిరుమల క్షేత్రం



వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గోవిందుని నామాలతో శ్రీవారి క్షేత్రం మార్మోగింది. ఆదివారం సెలవుదినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు చిన వెంకన్న దర్శనార్థం తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల రద్దీ ప్రారంభమైంది. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లు, అన్నదానం వద్ద భక్తుల సందడి నెలకొంది. దాదాపు 12వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ అధికారుల అంచనా. దర్శనానంతరం వారంతా వకుళమాత అన్న ప్రసాద భవనానికి చేరుకుని ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వెలమాటి హత్యతో కొవ్వలిలో విషాద ఛాయలు

జిల్లాతో ఆయనకు ప్రత్యేక అనుబంధం
వ్యాపారవేత్తగా, వితరణశీలిగా పేరుప్రఖ్యాతుల



వెలమాటి చంద్రశేఖర జనార్దనరావు (ఫైల్), ఆరోపణలు ఎదుర్కొంటున్న కీర్తితేజ

దెందులూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కొవ్వలి గ్రామానికి చెందిన విద్యాదాత, వెల్జన్ ఇండస్ట్రీస్ సంస్థల అధినేత వెలమాటి చంద్రశేఖర జనార్దనరావు (85) హైదరాబాద్‌లో హత్యకు గురయ్యారనే వార్త జిల్లా వాసులను ఆందోళనకు గురి చేసింది. కొవ్వలిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విద్యాదాతగా ఏలూరు జిల్లాతో ఆయన అనుబంధం ప్రత్యేకమైనది. సౌమ్యుడు, వివాదరహితుడు, సేవా గుణంతో పెద్ద ఎత్తున దానాలు చేయడంతో పాటు, వ్యాపార రంగంలో దేశంలోనే తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యక్తి వెలమాటి చంద్రశేఖర జనార్దనరావు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన ఆయన కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఉంటున్నారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ఇప్పటివరకు పలు దఫాలుగా నగదును అందించారు. టీటీడీలో భక్తుల భోజన వసతుల అభివృద్ధికి రూ.40.24 కోట్లు, కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్లు అందించారు. సొంత గ్రామంలో పశువుల ఆసుపత్రి, బీసీ హాస్టల్ అభివృద్ధితో పాటు ఆలయాన్ని కూడా నిర్మించారు. ఇప్పటివరకు తన సంస్థల ద్వారా లక్ష మందికి ఉద్యోగాలు అందించారు. ఏపీ, తెలంగాణలోని పలు దేవాలయాలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా రూ.8 కోట్లు అందించారు. తుఫాన్ బాధితుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి రూ. కోటి అందించారు. వైజాగ్, విజయవాడలోని అనాథ ఆశ్రమంలో అన్నదానానికి ఏటా రూ.30 లక్షలు అందిస్తూ వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో విద్య, వైద్యం మౌలిక వసతుల కల్పన ఉద్యోగ కల్పనకు కృషి చేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సొంత మనుమడి చేతిలో హత్యకు గురయ్యారన్న చేదు నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.



గజ వాహనంపై స్వామి వారి ఊరేగింపు, అన్నపర్వత మహా నివేదన నిర్వహిస్తున్న అర్చకులు, కనుల పండువగా పొన్న వాహన సేవ

అంతర్వేది నరసన్నకు అన్న పర్వత మహా నివేదన

అంతర్వేది, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆదివారం రాత్రి 7 గంటలకు అన్నపర్వత మహా నివేదన చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి దర్శనాలు నిలిపివేసి ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లా పొలమూరుకు చెందిన కలిదిండి వంశీయులు క్వింటాల్ బియ్యంతో అన్నం వండించారు. స్వామివారి మూల విరాట్ ఎదుట గంట మండపంలో అన్నం రాశిగా పోశారు. రెండు రకాల కూరలు, పప్పు, పులుసు, పెరుగు, నెయ్యి, బూరెలతో స్వామివారికి మహా నివేదన జరిపారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరిగి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజాబహదూర్, పొలమూరు వంశీయులు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అంతర్వేదిలో నేడు..

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారికి హనుమద్ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు పండిత సదస్యం, 7 గంటలకు సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరగనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

స్వామి వారికి గ్రామోత్సవం

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా పొలమూరి కుటుంబ సభ్యులు, భక్తులు వార్షిక అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు గజ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి వెంట నారసింహ, గోవిందనామస్మరణ చేశారు. రాత్రి 8 గంటలకు పొన్నవాహనంపై స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి హారతులు పట్టారు.

పేదలకు ఊరట



ఆక్రమణల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా

- ప్రభుత్వ స్థలాల్లో 150 గజాల్లోపు ఆక్రమణలు పేదల పరం
- మహిళల పేరిట పట్టా జారీ
- పల్లె, పట్టణాల్లో షరతులు, నిబంధనలతో అమలు

ఏలూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు వేసుకుని నివసిస్తున్న పేద వర్గాలకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. పల్లె, పట్టణ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పరచుకున్న వారికి ఇళ్లు, స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 150 గజాల లోపు స్థలాలను క్రమబద్ధీకరించి మహిళల పేరిట పట్టాలను జారీ చేయనున్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం అని మరోసారి రుజువు చేసింది. ఎలాంటి అభ్యంతరాల్లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం శనివారం ఉత్తర్వులిచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ చేపట్టనున్నారు. ఈ మేరకు భూపరిపాలనశాఖ ఉన్నతాధికారులు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. భూముల క్రమబద్ధీకరణంలో ఏమీ చేయాలో? ఏమీ చేయకూడదో నిర్దేశిస్తూ ఇటీవలే ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 30లో పేర్కొన్న నిబంధనలు అనుసరించి దరఖాస్తులను ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు స్వీకరిస్తారు

2019 అక్టోబరు ముందు వరకే..

2019 అక్టోబరు 15 ముందు ప్రభుత్వ స్థలాలలో ఆక్రమణలను సంబంధించిన దరఖాస్తులనే పరిశీలిస్తారు. వీటి వెంట దరఖాస్తుదారులు రుజువు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. లబ్ధిదారులు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరుతో ఇస్తారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు .ఆక్రమిత భూమి 150 గజాల పైన ఉంటే చెల్లించాల్సిన ఫీజు వివరాలు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా తెలుసుకోవచ్చునని ఉత్తర్వుల్లో తెలిపింది.

వీటికి నో ఛాన్స్..

ప్రైవేట్ వ్యక్తుల లే-అవుట్ స్థలాలు, కాల్వలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాల క్రమబద్ధీకరణ ఉండదు. రెవెన్యూ శాఖలో గతంలో పెండింగ్ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. భూముల క్రమబద్ధీకరణ చేయాలంటూ కలెక్టరేట్, మండలాల్లో జరిగే స్పందన కార్యక్రమాల్లో అర్జీలు వస్తుండడంతో ప్రభుత్వం సానుకూలంగా ప్రజల పక్షాన నిలిచి వారికి మేలు చేసేందుకు ఉపక్రమించింది.

ఇవీ నిబంధనలు

- భూముల క్రమబద్ధీకరణకు గ్రామాల్లో గరిష్ఠంగా నెలకు రూ.10వేలు, పట్టణాల్లో రూ.14వేలు ఆదాయం ఉన్న లబ్ధిదారులు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది.
- విద్యుత్ బిల్లుల చెల్లింపు రూ.300 మించి ఉండకూడదు.
- ఆర్‌సీసీ రూఫ్, ఆస్ బెస్టాస్ రూఫ్‌తో కట్టిన నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

గతంలో టీడీపీ ప్రభుత్వంలో 75 గజాలలోపు అభ్యంతరం లేని భూముల ఆక్రమణలను క్రమబద్ధీకరించడంతో ప్రజలు చాలా మంది సమస్యల నుంచి బయటపడ్డారు. ఆక్రమణలు తొలగించే కన్నా పేదలకు పట్టాలు ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

151 గజాలు మించితే చార్జి

అభ్యంతరం లేని 150 గజాలకు మించిన స్థలాలను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయించారు. 151 గజాల నుంచి 300లోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం రిజిస్ట్రేషన్లు, 450 గజాలలోపు 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా కార్యక్రమం పూర్తి అయ్యాక దరఖాస్తుల స్వీకరణ చేపట్టే అవకాశం ఉంది. కిందస్థాయిలో తహసీల్దార్లు, రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే ఇది పేదలకు మరింత ఉపయుక్తం కానుంది.

క్రైమ్ కార్నర్ వేర్వేరు చోట్ల నలుగురి బలవన్మరణం

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు సంఘటనలలో నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. కుమారుడి కళాశాల ఫీజు సొమ్ముతో భర్త మద్యం సేవించడంతో మహిళ పురుగుమందు తాగేసింది. కడుపునొప్పి భరించలేక ఒకరు, అనారోగ్యంతో మరొకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతి చెందారు. వాంతులు కావడంతో ఒకరి మృతి అనుమానాస్పదంగా మిగిలింది.

భర్త ప్రవర్తనతో విసిగిపోయి..

పెదవేగి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కుమారుడి కళాశాల ఫీజు కోసం దాచి ఉంచిన సొమ్ముతో భర్త మద్యం సేవించారు. దీనితో మనస్తాపానికి గురైన మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. రాట్నాలకుంట గ్రామానికి చెందిన మేరుగు మిరియమ్మ భర్త రమేష్ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో మిరియమ్మ కుటుంబ భారాన్ని మోస్తోంది. ఇంటర్ చదువుతున్న కుమారుడి కాలేజ్ ఫీజు కోసం ఇంట్లో దాచి ఉంచిన సొమ్మును తీసుకెళ్లి రమేష్ మద్యం తాగేశాడు. దీంతో మిరియమ్మ శనివారం రాత్రి పది గంటల సమయంలో పురుగుమందు తాగేసింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మిరియమ్మ(39) మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక..

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి కలుపుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ టి సుధీర్ తెలిపారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన ఘంటా సోమశేఖర్(42) కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. వ్యవసాయ పనులు చేసుకునే సోమశేఖర్ ఈనెల 5న రాత్రి 11.30 గంటల సమయంలో తన పొలంలో కలుపుమందు తాగి ఉదయం ఇంటికి వచ్చి విషయం చెప్పి పడిపోయాడు. బంధువులు భీమడోలు లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. అతడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బాధ పడుతూ..

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ పురుగు మందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. ఏలూరులోని దొంగల మండపం ప్రాంతానికి చెందిన ఆట్రగడ్డ మాధవి (31)కి భర్త సూరిబాబు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నారు. కొంత కాలం నుంచి మాధవి అనారోగ్యంతో బాధపడుతోంది. ఆ బాధ భరించలేక ఈనెల 7న సాయంత్రం ఇంటి వద్దే పురుగుమందు తాగింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో..

పాలకోడేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విస్సాకోడేరు గ్రామానికి చెందిన యడ్ల చంద్రశేఖర్ (44) అనుమానాస్పద స్థితిలో శనివారం రాత్రి మృతి చెందాడు. అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం కేసు నమోదు చేశారు. చంద్రశేఖర్ కొంత కాలం క్రితం కులాంతర వివాహం చేసుకుని వేరొక ప్రాంతా నికి వెళ్లిపోయాడు. మూడేళ్ల క్రితం చంద్రశేఖర్ ఒక్కడే విస్సాకోడేరులోని తల్లిదండ్రుల వద్దకు తిరిగి వచ్చాడు. ఇంట్లో మౌనంగా ఉంటున్నాడు. శనివారం మంచంపై పడుకుని వాంతి వస్తుందని చెప్పడంతో తల్లి సీతారత్నం భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లింది. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. సీతారత్నం ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు.

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి

మునునూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నీటి తొట్టెలో పడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన గోపవరంలో జరిగింది. పులిచర్ల సురేష్, నాగశ్రీ దంపతులకు కూమారుడు, కూమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం లోకేశ్ (4) ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఇంటి ఆవరణలోని నీటి తొట్టెలో పడిపోయాడు. కుమారుడు కనిపించడం లేదని చుట్టు పక్కల వెతికిన తల్లిదండ్రులు నీటితొట్టెలో చూడగా బాలుడు నీటిపై తేలియాడుతూ కనిపించాడు. స్థానిక ఆసుపత్రి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందినట్లు తెలిపారు.

కారు ఢీకొని యువకుడి మృతి

ఆకివీడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌ను కారు ఢీ కొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. ఏలూరు జిల్లా చినతాడినాడకు చెందిన టీడీపీ కార్యకర్త కొల్లాటి వెంకట యువరాజ్ (26) చినమిరంలోని ప్రైవేటు బ్యాంకులో పని చేస్తున్నాడు. తల్లి గృహలక్ష్మితో కలిసి యువరాజు శనివారం రాత్రి ఆకివీడులో క్రైస్తవ ఉజ్జీవ మహాసభలకు మోటారు సైకిల్‌పై వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటికి తిరిగి వెళుతుండగా దుంపగడప మినీ లారీ స్టాండ్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు వేగంగా మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో యువరాజ్, గృహలక్ష్మికి బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో భీమవరం ఆసుపత్రికి తరలించగా యువరాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువరాజ్ తండ్రి ఏడుకొండలు ఫిర్యాదు మేర ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజవరం వద్ద

కొయ్యలగూడెం, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): కారు మోటర్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని రాజవరం ఎర్రకాల్వ వంతెన దగ్గరల్లో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాద సంఘటనపై పూర్తి వివరాలు తెలియరాలేదు. కారు, మోటర్‌సైకిల్ ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు పలువురు చెబుతున్నారు.



ఆలయంలో కల్యాణోత్సవ ఏర్పాట్లు

నేడు నరసన్న కల్యాణం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఐఎస్ జగన్నాథపురంలో శ్రీలక్ష్మీ నారసింహుడు కొలువైన సుందరగిరి స్వామి వారి కల్యాణానికి సర్వం సిద్ధమైంది. కొండ దిగువన కల్యాణమండపంలో సోమవారం ఉదయం 11.10గంటలకు స్వామి వారి కల్యాణం జరగనుంది. ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో విద్యుద్దీప కాంతులీనుతోంది. చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురం లక్ష్మీనరసింహుని ఆలయంలో ఏటా ఐదు రోజులపాటు కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. శనివారం ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో విశేష పూజలు జరిగాయి. సుందరగిరిపైన, కొండ దిగువన ఏర్పాటుచేసిన విద్యుద్దీప అలంకారాలు, దేవతామూర్తుల భారీ విద్యుత్ కటౌట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



బంగారు పతకాలు సాధించిన పీడీలు కృష్ణారావు, పద్మ జయలక్ష్మి

వ్యాయామ ఉపాధ్యాయులకు బంగారు పతకాలు

రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల అథ్లెటిక్స్

దెందులూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో దెందులూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 8, 9వ తేదీలలో అనంతపురం నీలం సంజీవరెడ్డి స్టేడియంలో జరిగిన మాస్టార్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్‌లో పోతునూరు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ ఎం.కృష్ణారావు హైజంప్, ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకాలు సాధిం చారు. కలపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ పద్మ జయలక్ష్మి హైజంప్, 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారు. అథ్లెటిక్స్ స్పోర్ట్స్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంప్రసాద్ నుంచి పతకాలు అందుకున్నారు. పతకాలు సాధించిన వారిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు పరీక్షా పే చర్చ

భీమవరం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఉదయం 11 గంటలకు పరీక్షా పే చర్చ నిర్వహించారు. ఈ మేరకు ఏర్పాట్లపై ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. జిల్లాస్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో 9,700 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. 6నుంచి 10 వ తరగతి విద్యార్థులకు పాఠశాలల్లో ఏర్పాటు చెయ్యాలని అన్నారు. డీడీ నేషనల్, డీడీ న్యూస్, యూట్యూబ్, ఫేస్‌బుక్, ఈ విద్య, వంటి ఛానల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం వీక్షిస్తున్న విద్యార్థుల ఫొటోలను అప్‌లోడ్ చెయ్యాలని సూచించారు.



నాటక ప్రదర్శనలో సన్నివేశం

ఆకట్టుకున్న నాటకోత్సవాలు

నూజివీడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నూజివీడులో నిర్వహించిన నాటకోత్సవాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం గంగోత్రి సాయి దర్శకత్వంలో తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో విడాకులు కావాలి సాంఘిక నాటిక కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించగా ఆహుతులను ఆలోచింపజేసింది. రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో కళా సాంస్కృతిక వైభవం క్షీణించిందన్నారు. కార్యక్రమంలో నూజివీడు సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపల్ మోహన్, లయన్స్ క్లబ్ సభ్యులు కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై కేసు

టి.నరసాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్త, అతడికి సహకరించిన మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామానికి చెందిన సకలాబత్తుల శ్రీను, ఉషారాణికి 20 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల శ్రీను భార్యను అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అతడికి మరో ఐదుగురు సహకరిస్తున్నారు. బాధితురాలు ఉషారాణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్.. స్టడీ మెటీరియల్‌తో డీఎస్సీ అభ్యర్థులు

ప్రతి సేవా కార్యక్రమానికి స్ఫూర్తి చంద్రబాబే : చింతమనేని

పెదవేగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సేవా కార్యక్రమానికి తనకు స్ఫూర్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. డీఎస్సీ అభ్యర్థులకు చింతమనేని చారిటబుల్ ట్రస్ట్‌ద్వారా ఉచితంగా ఏర్పాటు చేసిన కోచింగ్ వంద రోజులు పూర్తయిన సందర్భంగా దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఆదివారం 500 మంది డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని, శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థి ఉద్యోగాలు సాధించి, భవిష్యత్‌ను ఉన్నతంగా మల్చుకోవాలని సూచించారు. ప్రఖ్యాత ఫ్యాకల్టీలతో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు భోజన వసతి, స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించిన ఎమ్మెల్యేకు డీఎస్సీ అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, గాంధీ, జిల్లా రైస్‌మిల్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సువేర ప్రసాద్, సత్యనారాయణ, కోశాధికారి వడ్లపట్ల నరసింహారావు, వేణుగోపాల్ లునాని, పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, బొప్పన సుధాకర్, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, మోరు శ్రావణి, గారపాటి రామసీత తదితరులు పాల్గొన్నారు.



జనార్దనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు, మానవతా సభ్యులు

పారిశ్రామిక వేత్త 'వెలమాటి' మరణం తీరని లోటు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కొవ్వలి గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త వెలమాటి చంద్రశేఖర్ జనార్దనరావు మృతి తీరని లోటని వైద్యులు, మానవత సభ్యులు అన్నారు. ఆదివారం ఏలూరు రెడ్‌క్రాస్ భవనంలో ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తగా వెలమాటి ఎదిగి హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ తన స్వగ్రామానికి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఏలూరు ఆసుపత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ భవనానికి రెండు కోట్ల రూపాయల విరాళాన్ని ఇచ్చి ఆ భవనానికి ఆయన తల్లిదండ్రుల పేరుతో నిర్మించారు. ప్రభుత్వాసుపత్రిలో గుండె, క్యాన్సర్ విభాగాలకు సంబంధించిన ఆసుపత్రిని తానే నిర్మిస్తానని, అందుకు ఒక్కొక్క విభాగానికి రూ.40 కోట్లు అందిస్తానని ముందుకు వచ్చారు. ప్రభుత్వాసుపత్రిలో స్థలాన్ని తమకు ఇస్తే ఆసుపత్రి నిర్మించి తామే నిర్వహిస్తామని చెప్పడంతో ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. ఆసుపత్రికి అవసరమైనవి వస్తువులను అందిస్తానని మాటిచ్చారు. దురదృష్టవశాత్తు ఆయన మనుమడే హతమార్చడంతో కార్యక్రమాలు నిలిచిపోయాయని బాధను వ్యక్తం చేశారు. డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, మానవతా సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, కడియాల కృష్ణారావు, రత్నాకరరావు, వీఎస్ఆర్‌కే ప్రసాద్, రెడ్‌క్రాస్ సిబ్బంది ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా రక్షకదళం సేవలపై అవగాహన కార్యక్రమాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, బాలికల రక్షణను దృష్టిలో ఉంచుకుని ఎస్పీ కిశోర్ అభయ మహిళా రక్షకదళాన్ని జిల్లాలో ఏర్పాటు చేశారని మహిళా పోలీసులు జిల్లాలోని మహిళలకు అవగాహన కార్యక్రమాల ద్వారా వివరిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన కూడళ్ళకు వెళ్లి మహిళలకు అభయ మహిళా రక్షక బృందం చేస్తున్న కార్యక్రమాలు వివరిస్తున్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధించినా పోలీస్ సహాయం కావాలన్న వెంటనే 112కు కాల్ చేస్తే అభయ రక్షక మహిళా దళం పది నిమిషాల్లోపే చేరుకుంటుందని వివరించారు. సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులు పంపించే లింకులను ఓపెన్ చేయకూడదన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే 95503 51100 వాట్సాప్ సమాచారం అందించాలన్నారు.



మహిళలకు అభయ మహిళా రక్షక బృంద సేవలను వివరిస్తున్న మహిళా పోలీసులు

'మీ దుఃఖాన్ని సంతోషంగా మార్చే దేవుడు ఏసుక్రీస్తు'

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): మీదుఃఖాన్ని సంతోషంగా మార్చే దేవుడు ఏసుక్రీస్తు అని అంతర్జాతీయ సువార్తీకులు డాక్టర్ పాల్ దినకరన్ అన్నారు. ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఏసు మన్నాచర్చి ఆధ్వర్యంలో 'ఏసు పిలుచుచున్నాడు ప్రార్థన పండుగలు' ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. మన్నా చర్చి బిషప్ ఎం.ఎలీషారాజు, సీనియర్ పాస్టర్ ఎం.జ్యోతిరాజు మూడు రోజులుగా ఈ పండుగలు నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు ఇప్పుడు మన అందరి మధ్యలో ఉన్నాడన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి, కో-ఆప్షన్‌సభ్యులు ఎస్ఎంఆర్. పెదబాబు హాజరై ఏసుక్రీస్తు కృప నగర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.సిటీ పాస్టర్స్ అసోసియేషన్‌కు చెందిన పలువురు దేవుని సేవకులు బిషప్ జాన్‌ఎస్‌డీ రాజు, సిస్టర్ ఇవాంజలిన్‌పాల్ దినకరన్, బ్రదర్ శామ్యూల్‌దినకరన్, సిస్టర్ స్టెల్లా రమోలా, బ్రదర్ డేనియల్ డేవిడ్‌సన్, సిస్టర్ సునీత వాఖ్యసందేశాన్ని ఇచ్చారు. సండే స్కూల్ విద్యార్థులు నాటికలు ప్రదర్శించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ దినకరన్



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో ఎమ్మెల్యే రోషన్‌కుమార్, తదితరులు

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

ఏలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో వున్న అభయాంజనేయ స్వామి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పూజా కార్యక్రమాల్లో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. నాలుగో వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ, మేరీ సుశీల దంపతులచే 2017లో ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం అభినయ కూచిపూడి నాట్య అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలికల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆధ్యాత్మికవేత్త టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, టీడీపీ నేతలు మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, పెనుమర్తి రామ్‌కుమార్, కొండ్రెడ్డి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

'బొగ్గు నిల్వలు వెలికితీసి యువతకు ఉపాధి కల్పించాలి'

చింతలపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ప్రాంతంలో ఉన్న బొగ్గు నిల్వలను వెలికితీసి ఆ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు తుర్లపాటి రాజు కోరారు. ఆదివారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో దీనివల్ల యువతకు అవకాశాలు కల్పించడమే కాకుండా రాష్ట్రానికి ఆదాయం చేకూరుతుందన్నారు. ఏలూరులో ఉన్న జూట్‌మిల్లు కూడా మూతపడ్డాయని, వాటి స్థానంలో ప్రభుత్వ రంగ పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. వీటిపై మూడు రోజులపాటు జరిగిన రాష్ట్ర మహాసభల్లో తీర్మానాలు చేసినట్టు తెలిపారు.

రూ.12 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేశాం

» ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో రూ.12 కోట్లతో రహదారులను అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుందరయ్య కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడామన్నారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు నాంది పలికిందన్నారు. సంక్షేమాల వరాల జల్లు కురిపిస్తామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నా మన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

పేదలకు ఉచితంగా వైద్యసేవలను అందిస్తున్న సరస్వతి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ కె.నరేష్, డాక్టర్ దాకారపు సాయిదీప్తిలను ఎమ్మెల్యే చంటి అభినందించారు. ఆదివారం సరస్వతి హాస్పటల్ మల్టీస్పెషాలిటీ ట్రామాకేర్ సెంటర్‌లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్తులో పేదల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలు అందించాలన్నారు. వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశామన్నారు. అవసరమైన వారికి ఉచిత శస్త్ర చికిత్సలు అందిస్తామన్నారు. డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, ఎస్ఎంఆర్ పెదబాబు, పార్థసారథి, ఎంఆర్‌డీ బలరామ్, వందనాల శ్రీనివాస్, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు, దాకారపు రాజేశ్వరరావు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి



పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగిలో 'చదవడం మాకిష్టం'

పెదవేగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయం అంటే విజ్ఞానఖని అని పెదవేగి శాఖ గ్రంథాలయ గ్రంథ పాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి గ్రంథపఠనం చేశారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు సృజనాత్మకతను పెంచే కార్యక్రమాల్లో పాల్గొనడంద్వారా వ్యక్తిలో అంతర్లీనంగా ఉండే కళలు వెలికి వస్తాయని చెప్పారు.

క్రికెట్ లోగో ఆవిష్కరణ

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్నేహాంజలి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఈనెలలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన లోగోను ఆదివారం తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయచౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా పలు కారణాలతో మృతి చెందిన మిత్రుల జ్ఞాపకార్థంగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. స్నేహాంజలి ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు ఉల్లింగల చందు, సురేష్, మహేష్, రెడ్డితోపాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు



ప్రవీణ్ (ఫైల్)

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ రిపేరు షాపు నిర్వహిస్తున్న ఒక యువకుడు అదృశ్యం అయ్యాడని పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు వన్‌టౌన్‌లోని గాజులవారి వీధినకు చెందిన రేపాక ప్రవీణ్ (31) వివాహం కాలేదు. ఈనెల 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్ళిన అతడు తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. ఆచూకీ కానరావడంతో అతడి సోదరుడు ప్రతాప్ వన్‌టౌన్ పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జి. సత్యనారాయణ తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రశాంతి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దున్నా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ వైద్యులు శ్రీకృష్ణ హాస్పిటల్ అధినేత డాక్టర్ బి.కృష్ణ సిబ్బందితో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందించారు. అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఎస్.ఆర్ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు జీఎస్‌వీవీ రామారావు, కోశాధికారి టి.రామ్మోహన్‌రావు, డాక్టర్ శివరామకృష్ణ, అసోసియేషన్ సభ్యులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

నేడు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖరం నామినేషన్

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నామినేషన్ వేయనున్నట్టు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య తెలిపారు. ఏలూరు టీడీపీ జిల్లా కార్యాలయం నుంచి 10 గంటలకు ర్యాలీగా బయల్దేరి కలెక్టరేట్‌కు చేరుకుంటారన్నారు. నామినేషన్ కార్యక్రమంలో మంత్రులు, శాసనసభ్యులు, ఎంపీలు, కూటమి నాయకులు, కార్యకర్త లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజశేఖరాన్ని గెలిపిద్దాం..

లింగపాలెం/ఏలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ల చలపతిరావు అన్నారు. ఆదివారం లింగపాలెంలో ఆయన కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజశేఖర్‌ను గెలిపించేందుకు కూటమి నాయకులు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అఖండ మెజారిటీతో గెలిపించాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలోని సీహెచ్ఆర్ టౌన్ హాల్‌లో కూటమి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సోమవారం రాజశేఖర్ నామినేషన్‌కు జంగారెడ్డిగూడెం నుంచి భారీస్థాయిలో కూటమి నాయకులు హాజరుకావాలని ఎమ్మెల్యే సూచించారు.

అచ్చమ్మ పేరంటాలమ్మకు ఎమ్మెల్యేల పూజలు

దెందులూరు,ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆదివారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ గజమాల, బొకేలు అందజేసి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ అచ్చమ్మ తల్లి మనజిల్లాలో ఉండడం అదృష్టమన్నారు. సంప్రదాయ బద్ధంగా ఉత్సవాలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్‌రావు, మాజీ జడ్పీటీసీ గారపాటి సీత, టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, మోతుకూరి నాని, బొప్పన సుధాతో పాటు టీడీపీ నాయకులు జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని, చంటి

ప్రత్యేక అలంకరణలో పేరంటాలమ్మ

అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ 68వ వార్షికోత్సవం సందర్భంగా ఆరో రోజు ఆదివారం మయూర (నెమలి పించము ల) అలంకరణలో దర్శనమిచ్చారు. సినీ సింగర్ స్నేహ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం విశాఖపట్నం వారి రోషన్ లాల్ ఆర్కెస్ట్రాతో కలిసి సినీ లక్ష్మీగాయత్రి పాటలు పాడి భక్తులను అలంకరించారు. ఆమెను కమిటీ సభ్యులు సన్మానించారు.



గుబ్బల మంగమ్మ ఆలయానికి సోలార్ లైట్లను బహూకరిస్తున్న సోలార్ కంపెనీ ప్రతినిధులు

గుబ్బల మంగమ్మ ఆలయానికి సోలార్ లైట్ల బహూకరణ

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతంలోని గుబ్బల మంగమ్మ ఆలయానికి సికింద్రాబాద్‌కు చెందిన టెల్ టవర్ సోలార్ కంపెనీకి చెందిన వారు కుంజా నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ఆరు సోలార్ లైట్లను బహూకరించారు. ఆలయం వరకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సోలార్ లైట్ల బహూకరణతో ఆలయ ప్రాంగణంలో విద్యుత్ సమస్యను అధిగమించవచ్చని కమిటీవారు తెలిపారు. సర్పంచ్ కోర్స గంగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకోడానికి అధిక సంఖ్యలో భక్తజనం ఆదివారం తరలి వచ్చారు. జిల్లా నలుమూలలనుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయానికి వస్తున్న భక్తుల సంఖ్య ప్రతివారం పెరుగుతూనే ఉందని ఆలయ కమిటీవారు తెలియజేస్తున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు.

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి

చింతలపూడి/లింగపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని భూమి గల రైతులకు ఒక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇస్తామని, వ్యవసాయ సేవలను మరింత సులభతరం చేసి పారదర్శకంగా తీసుకురావాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందని చింతలపూడి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నాగకుమార్, లింగపాలెం మండలం ఏవో కోటగిరి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ రైతు సంక్షేమ కేంద్ర మంత్రిత్వశాఖ, రాష్ట్ర వ్యవసాయశాఖ చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమంలో రైతులు ఈ గుర్తింపు సంఖ్య పొందడం వల్ల మున్ముందు అనేక ప్రయోజనాలున్నాయన్నారు. భూమిగల యజమానులు తమ ఆధార్ నంబర్, ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్, పాస్‌బుక్ తీసుకువెళ్లి ఆయా పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. దీనివలన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలు, పెట్టుబడి సాయం అనేక సదుపాయాలు ఈ సంఖ్య నమోదు చేసుకుంటేనే సాధ్యమవుతుందన్నారు.

ఆధ్యాత్మికం

భీమడోలులో అమ్మవార్ల జాతర

భీమడోలు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు గ్రామంలో జాతర మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఆదివారం గ్రామంలో గంగానమ్మ, పోతురాజు, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల గ్రామోత్సవం జరిగింది. తొలుత ఆలయ ప్రాంగణంలో గణాచారులు, తంబలవారు అమ్మవార్లకు సంబరం నిర్వహించారు. గ్రామంలో ఘటాలతో ఊరేగింపు వేడుకగా జరిగింది. ఆలయం ఛైర్మన్ శ్రీనివాస్‌బాబు, జాతర కమిటీ పాల్గొన్నారు.



భీమడోలులో ఊరేగింపులో పాల్గొన్న జాతర కమిటీ సభ్యులు

• టి.నరసాపురం : బొర్రంపాలెంలో కనకదుర్గమ్మ ఆలయ 36వ వార్షికోత్సవం ఆదివారం నుంచి ఐదురోజులు పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వీరంకి వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆఖరి రోజున అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

• పెదవేగి : రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగలి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాలద్వారా రూ.32,600, లడ్డూ ప్రసాదాల విక్రయాలద్వారా రూ.21,510 ఆదాయం వచ్చిందని ఈవో ఎన్.సతీష్‌కుమార్ చెప్పారు.

• ఏలూరుకార్పొరేషన్: స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో జరుగుతున్న 93వ రామకోటి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు, మాజీ కార్పొరేటర్ మారం హను, ఉత్సవాల గౌరవ అధ్యక్షులు కొట్టు మధు వెంకటరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ దంపతులను రామకోటి ఉత్సవాల కార్యవర్గ సభ్యులు గాదంశెట్టి రమేష్‌కుమార్ బృందం ఆలయ మర్యాదలతో సత్కరించారు. నిర్వాహకులను ఎమ్మెల్యే, మేయర్ అభినందించారు.

• ఏలూరుకార్పొరేషన్, : స్థానిక తూర్పువీధిలోని వంకినేనివారివీధిలో ఉన్న గంగానమ్మ మహాలక్ష్మమ్మ పోతురాజుబాబు దేవాలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వంకినేని భానుప్రకాష్, మహేంద్రకుమార్, మునునూరి బాలాజీ, యడ్లపాటి రాములు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

ఇంటర్వ్యూ..

మండలంలో 16 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు



దామా వెంకటేశ్వర్లు
వ్యవసాయాధికారి,
దెందులూరు

• **మండలంలో వరి ధాన్యం కేంద్రాలు ఎన్ని ?**

జవాబు : మండలంలో 16 చోట్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి,

• **రైతు భరోసా కేంద్రాలు పని చేస్తున్నాయా ?**

జవాబు : నూతన ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది.

• **మండలంలో వ్యవసాయ శాఖ సొంత భూమిలో ఏమి చేస్తున్నారు ?**

జవాబు : మండలంలో దోసపాడు, కొవ్వలి పరిధిలో 84 ఎకరాల వ్యవసాయ శాఖ సొంత భూమి ఉంది. ప్రభుత్వం 1121 వరి విత్తనం ఏపీ సీడ్స్ పేరుతో అభివృద్ధి చేసి 50 శాతం రాయితీతో రైతులకు విత్తనాలు అందిస్తున్నాం.

• **రైతులకు ఇన్సూరెన్సు పథకాలు ఉన్నాయా ?**

జవాబు : రైతులు ఎకరానికి వరి పంటకు రూ.500, మొక్కజొన్న రైతు రూ.483, అపరాల రైతు రూ.60 చెల్లిస్తే పంటల బీమా వర్తిస్తుంది

• **ఈ-క్రాప్ నమోదు వల్ల ప్రయోజనాలేంటి ?**

జవాబు : రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల ప్రకృతి విపత్తుల సమయంలో నష్టపరిహారం, ప్రభుత్వ సబ్సిడీలు రావాలంటే ఈ క్రాప్ చేయించాలి.

(ఆంధ్రజ్యోతి-దెందులూరు)

12న మన్యం బంద్ విజయవంతం చేయాలి

కుక్కునూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): 1/70 చట్టాన్ని సవరణ చేయాలని చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈనెల 12న నిర్వహించే మన్యం బంద్ విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కూరం సంజీవరావు పిలుపునిచ్చారు. ఆదివారం కుక్కునూరులో జరిగిన ఆదివాసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసి ప్రాంతాల్లో చట్టాల వల్ల టూరిజం అభివృద్ధి చెందకపోవడానికి చట్టాలే కారణం అనడం సరికాదన్నారు. షెడ్యూల్ ఏరియాలో పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు మార్చడం అవసరం లేదన్నారు. సమావేశంలో పొడియం వేణుగోపాల్, సరియం ప్రసాద్, చినబాబు, పాపారావు, వెంకటేష్ పాల్గొన్నారు.



రాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న హైకోర్టు న్యాయవాది వేణుగోపాల్

రంపాల రాజు మరణం పార్టీకి తీరనిలోటు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) ఏజెన్సీలో భూసమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన రంపాల రాజు మరణం పార్టీకి తీరనిలోటని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి గాది దివాకర్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన ఆయన భౌతికకాయాన్ని ఆదివారం సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. న్యూడెమొక్రసీ, పీవైఎల్, పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ అరుణోదయ సంఘాలకు చెందిన నాయకులు ధర్మాల సురేష్, ఎం.వెంకటేశ్వర్లు, జె.వెంకటేశ్వర్లు, హైకోర్టు సీనియర్ న్యాయవాది వి.వేణుగోపాల్, ఎస్.రామ్మోహన్, పి.శ్రీనివాస్, కారం రాఘవ, కేవీ రమణ, న్యాయవాదులు ఎన్.శ్రీమన్నారాయణ, యు.ఏసుబాబు అచ్యుత శ్రీనివాసరావు, ఈ.భూషణం తదితరులు నివాళులర్పించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణం అశ్వారావుపేట రోడ్డులోని పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.24,600 నగదు, 104 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎస్‌కే జబీర్ తెలిపారు.



నేత్రపర్వంగా శివ కల్యాణం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శివదేవుని ఆలయంలో స్వామివారి కల్యాణం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. కల్యాణతంతు భక్తులను అలరించింది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతీ సమేత శివయ్య కల్యాణ మూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేసి కల్యాణతంతును నిర్వహించారు. డోలు,సన్నాయి వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు.

పోలవరంలో నిలిచిపోయిన ఏటీఎం సేవలు

కొనసాగించాలని ప్రజల విజ్ఞప్తి



ఐదేళ్లుగా మూసివేసిన ఏటీఎం గది

చాట్రాయి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) :మండలంలోని పోలవరంలో యూనియన్ బ్యాంకు ఏటీఎం ఐదేళ్ల నుంచి పనిచేయకపోవడంతో బ్యాంకు ఖాతాదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తొమ్మిళ్ల క్రితం పోలవరంలో ఆంధ్రా బ్యాంకు ప్రారంభించి ఏటీఎం కూడా ఏర్పాటు చేశారు. తరువాత ఇది యూనియన్ బ్యాంకుగా మారింది. నాలుగేళ్ల పాటు ఏటీఎం పనిచేసినా తరువాత మూసివేశారు. ఇప్పటికీ అదే పరిస్థితి. ఈ బ్యాంకులో పోలవరం, మంకొల్లు, మర్లపాలెం, సోమవరం, కొత్తగూడెం, తుమ్మగూడెం మొదలైన గ్రామాలకు చెందిన సుమారు 7,500 ఖాతాలు ఉన్నాయి. ఇక్కడ ఏటీఎం సెంటర్ లేకపోవడంతో ఖాతాదారులు 10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని చాట్రాయి, చింతలపూడి, రమణక్కపేట వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి పోలవరంలో ఏటీఎం సెంటర్ పునఃప్రారంభించాలని ఖాతాదారులు ప్రజలు కోరుతున్నారు.



తిరునాళ్ల ప్రచార పత్రికను ఆవిష్కరిస్తున్న రెవరెండ్ ఫాదర్ లాము జయరాజు

సిలువగట్టు తిరునాళ్ల పోస్టర్ ఆవిష్కరణ

నూజివీడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : నూజివీడు పవిత్ర సిలువగట్టు తిరునాళ్ళ గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 26 నుంచి 28వ తేదీ వరకు ఈ తిరునాళ్ళను నిర్వహించనున్నట్టు నూజివీడు వికారియేట్ ఫారెన్ రెవరెండ్ ఫాదర్ లాము జయరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులంతా కలిసి నిర్వహించే అతిపెద్ద పండుగ అని అన్నారు. 14 ఏళ్లుగా తిరునాళ్ళను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రెక్టార్ ఫాదర్ జి.జోసఫ్, ఫాదర్లు, సిస్టర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రఘునాథునికి ప్రత్యేక పూజలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రఘునాథ స్వామి దేవస్థానంలో శ్రీమద్ రామాయణ పారాయణం, నాలాయిర దివ్య ప్రబంద సేవా కాల కార్యక్రమాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పారాయణ, సేవా కాలం, రామపట్టాభిషేకం విన్నపం తదనంతరం మంగళాశాసనం, రుత్విక్ సమ్మానమ్ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్థానాచార్యులు ఎస్.టి.పి.వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించగా, మాజీ సర్పంచ్ గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు, వెంకట శశిరేఖ, చలసాని సాయిబాబు, సుమ దంపతులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఉన్న రఘునాథుడు



విద్యార్థులతో బీజేపీ మండల నాయకుడు గోగినేని శ్రీనివాస్ కుమార్, తదితరులు

వేద పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : నూజివీడు మండల బీజేపీ నాయకులు గోగినేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు, వెంకట శశిరేఖ దంపతుల 40వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి శ్రీశోభనాచల లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలోని వేద పాఠశాలను సందర్శించి, గోసేవ నిమిత్తం రూ.5వేలు విరాళాన్ని పాఠశాల చైర్మన్ సూరిశర్మకి అందజేశారు. వేద పాఠశాల విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు, సాయి, జి.మోహన్ గణేష్ చతుర్వేది, కొవ్వూరు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు నెంబరు కోసం రైతులు నమోదు చేసుకోవాలి

చాట్రాయి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు నెంబరు కోసం సొంత భూమి కలిగిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి శివశంకర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరించడానికి కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆధార్ తరహాలో 14అంకెల యూనిక్ ఐడీని అందిస్తోందని, తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని అన్నారు.పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ లేదా 1-బి అడంగల్, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ తీసుకురావాలని అన్నారు. ఈ ఐడీ వలన రైతులు అనేక రకాల సేవలు పొందవచ్చని అన్నారు.

నేడు నరసింహుడి కల్యాణం



ఆలయంలో చేపట్టిన ఏర్పాట్లు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 9(ఆంధ్ర జ్యోతి): ఐఎస్ జగన్నాథపురంలో శ్రీలక్ష్మీ నారసింహుడు కొలువైన సుందరగిరి స్వామి వారి కల్యాణానికి సర్వం సిద్ధమైంది. కొండ దిగువన కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 11.10 గంటలకు స్వామి వారి కల్యాణం జరగనుంది. చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురం లక్ష్మీనరసింహుని ఆలయంలో ఏటా ఐదు రోజుల పాటు కల్యాణ మహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో విశేష పూజలు జరిగాయి. సుందరగిరిపైన, కొండ దిగువన ఏర్పాటు చేసిన విద్యుద్దీప అలంకారాలు, దేవతామూర్తుల భారీ విద్యుత్ కటౌట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ప్రశాంతంగా హిందీ ప్రచార సభ పరీక్షలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : హిందీ భాషపై విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో మక్కువ పెరుగుతోంది. జాతీయ భాషపై చిన్నారులు పట్టుసాధించాలనే ఉద్దేశంతో దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలకు తమ చిన్నారులను తర్ఫీదునిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నూజివీడులో ఎస్.ఆర్.ఆర్. బాలుర ఉన్నత పాఠశాల, త్రివిధ పాఠశాలల్లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలను నిర్వహించారు. ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర, ప్రవీణ, విశారద తదితర పరీక్షలకు బాలుర ఉన్నత పాఠశాలల్లో 159 మంది పరీక్షలకు హాజరు కాగా, త్రివిధ పాఠశాలలో 118 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు వీరికి ప్రచార సభ పరీక్షలను నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

సమస్యల పరిష్కారానికి...

మార్గం చూపండి

ముదినేపల్లి, గుడ్లవల్లేరు, బంటుమిల్లి రోడ్డులో సమస్యలు తిష్ట - చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



వడాలి వద్ద చెరువులో కలసిపోతున్న రోడ్డు

ముదినేపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి నుంచి గుడ్లవల్లేరు, బంటుమిల్లి గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై సమస్యలు తిష్ట వేశాయి. వడాలి వద్ద రోడ్డు కోతకు గురికావడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు చెరువులో కలిసిపోవడంతో రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే ప్రాంతంలో మలుపు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు చెరువులోకి దూసుకుపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఒక పక్క చెరువు, మరో పక్క డ్రెయిన్ ఉండడంతో ఇబ్బందికరంగా మారింది. కోతను నివారించేందుకు ఆర్ అండ్‌బీ శాఖ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గురజ గ్రామం వద్ద మలుపు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాల్వ గట్టుపై ఓ పక్కన చెట్లు దట్టంగా పెరిగిపోవడంతో రోడ్డు కనిపించక ఇటీవల ద్విచక్ర వాహనదారుడు కల్వర్టును ఢీకొట్టాడు.. అలాగే ఇదే మలుపులో గతంలో ఎదురుగా వస్తున్న సైక్లిస్టును తప్పించబోయి ఓ ట్రాక్టర్ కాల్వలో బోల్తా కొట్టింది. గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే ఇరువైపుల నుంచి వాహ నాలు కనిపించే విధంగా చెట్లను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పెనుమల్లి వద్ద మరో చెరువు రోడ్డుకు చేర్చి ఉండటంతో రహదారి కోతకు గురవుతోంది. ఏళ్ళ తరబడి రోడ్డు అంచెలంచెలుగా కోసుకుపోతున్నా పట్టించుకునేవారే లేకుండాపోయారు. రోడ్డు మార్జిన్ పూర్తిగా చెరువులో కలిసిపోవడంతో ఆ ప్రదేశంలో రక్షణ లేకుండాపోయింది. చెరువు నీటికి రోడ్డు కోసుకుపోకుండా రిటైనింగ్ వాల్ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గురజ గ్రామం వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న మలుపు



పెనుమల్లి వద్ద కోసుకుపోయిన ప్రధాన రహదారి

ఎట్టకేలకు మోక్షం..



వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధిని విస్మరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులకు మరమ్మతులు నిర్వహించడంతో రోడ్ల సమస్యకు మోక్షం లభించింది. కైకలూరు మండలంలోని ఆటపాక నుంచి అగ్రహారం మీదుగా వెళ్లే వరహాపట్నం ఆర్అండ్‌బీ రోడ్డు గతంలో గోతులతో అధ్వానంగా ఉండేది. కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు రూపురేఖలు మార్చివేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

\- కైకలూరు



టీడీపీలో చేరనున్న కాలసాని సోదరులు

చాట్రాయి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైసీపీకి కంచుకోటైన బూరుగ్గూడెంలో ఆ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరించిన యాదవ సామాజికవర్గానికి చెందిన కాలసాని సూర్యనారాయణ, చెన్నారావు సోదరుల ఆధ్వర్యంలో 200 మంది అనుచరులతో సోమవారం నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరనున్నారు. వీరి చేరికతో టీడీపీకి మరింత బలం పెరుగుతుందని, వైసీపీకి ఇది ఊహించని షాక్ అని పలువురు పేర్కొంటున్నారు.

వైభవంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

ముసునూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో ఉన్న షిర్డీ సాయి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పోలవరపు నరసింహరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకులు దీపక్ పాండ్యా స్వామికి సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నసమారాధనలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



చెరువులకు వస్తున్న తాగునీటిని పరిశీలిస్తున్న అధికారులు

తాగునీటి చెరువుల్లో క్లోరినేషన్ చేయాలి

కలిదిండి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : నీటితో నింపుతున్న చెరువుల్లో క్లోరినేషన్ చేయాలని కృష్ణారావు అన్నారు. ఆదివారం పెదలంక, మూల్లంక, భాస్కరావు పేట, గుర్వాయిపాలెం గ్రామాల్లో తాగునీరు పెడుతున్న చెరువులను పరిశీలించారు. పెదలంకలో ఎండిపోయిన తాగునీటి చెరువుకి నీటి వంతు వెళ్తుందని, 80 శాతం చెరువు నిండే వరకు పూర్తిగా కాల్వ ద్వారా తాగునీటి వంతు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వర రావు, పెదలంక సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు దున్న భోగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆటల పోటీలకు పిఠాపురం వెళ్లిన క్రీడాకారిణులు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

ముసునూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన పోటీల్లో మండలంలోని రమణక్కపేట జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో ప్రస్తుతం జరుగుతున్న అండర్-16 బాస్కెట్ బాల్ పోటీల్లో టి.నాగసుధ, డి.భార్గవి ఆడనున్నారు. ఇప్పటికే తరలివెళ్లినట్టు ఫిజికల్ డైరెక్టర్ వాకా నాగరాజు తెలిపారు. తరలివెళ్లిన విద్యార్థులను హెచ్.ఎం.రామకృష్ణారావుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి



ముసునూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపవరం గ్రామంలో ఆదివారం విషాద ఘటన చోటు చేసుకుంది. ప్రమాద వశాత్తు నీటి తొట్టెలో పడి నాలు గేళ్ళ బాలుడు మృతి చెందాడు. పులిచర్ల సురేష్, నాగశ్రీ దంపతుల కూమారుడు లోకేశ్(4) అడుకుంటూ ఇంటి అవరణలోని నీటితొట్టెలో పడిపోయాడు. తల్లీదండ్రులిద్దరూ ఇంట్లోనే ఉన్నా ఈ విషయం గమనించలేదు. కొంత సేపటి తరువాత తమ కుమారుడు కనిపించడంలేదని గాలించగా నీటి తొట్టెలో తేలియాడుతూ కనిపించాడు. వెంటనే బాలుడిని స్థానిక ఆసుపత్రి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో తమ కుమారుడు ఇక లేడనే విషయాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక శోకసంద్రంలో మునిగిపోయారు.

'ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి'

ముదినేపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి సభ్యుడి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ కోరారు. మంత్రిగా, శాసన సభ్యుడిగా అనుభవం కలిగిన రాజేంద్ర ప్రసాద్‌ను పెద్దల సభకు పంపాల్సిన అవసరముందన్నారు. పట్టభద్రులు, ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలపై అవగాహన కలిన ఆయన ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తారని, ఓటర్లు తమ మొదటి ప్రాధాన్యతా ఓటును కూటమి అభ్యర్థి రాజేంద్ర ప్రసాద్‌కు వేయాలని వినోద్ కోరారు.

మట్టగుంటలో ఎన్నికల ప్రచారం

కలిదిండి : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్ కూటమి నాయకులు ఆదివారం మట్టగుంటలో పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అండ్రాజు దుర్గారావు, నాగిడి వీరబ్రహ్మం, బళ్లా రాజు, ఈశ్వర పరశురాముడు, రాధాకృష్ణ, వాతాడి రాంబాబు పాల్గొన్నారు.

నేడు ఆలపాటి ఆత్మీయ సమావేశం

కైకలూరు : ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆత్మీయ సమావేశాన్ని సోమవారం కైకలూరులో నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఆయనను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో సాయంత్రం 4గంటలకు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కూటమి నేతలు, కార్యకర్తలు, పట్టభద్రులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

11న చేవూరు దేవస్థానం చెరువు లీజు వేలం

ముదినేపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం చేవూరు గ్రామంలోని లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానానికి చెందిన ఎకరా 95 సెంట్ల విస్తీర్ణంలోని చెరువులో చేపల పెంపకానికి లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 11న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ చెరువును మూడు సంవత్సరాల కాల పరిమితికి లీజుకు ఇచ్చేందుకు చేవూరులోని దేవస్థానం కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రికార్డు స్థాయిలో దరఖాస్తుల స్వీకరణ

మద్యం దుకాణాల లాటరీ వాయిదా

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీత కార్మికులకు రిజర్వు చేసిన నాలుగు మద్యం దుకాణాలకు రికార్డు స్థాయిలో అర్జీలు దాఖలయ్యాయి. నాలుగు మద్యం దుకాణాలకు గానూ 78 అర్జీలు దాఖలు కాగా, మద్యం షాపుల డ్రా కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడినట్టు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. సోమవారం చలసాని గార్డెన్స్‌లో మద్యం షాపుల డ్రా నిర్వహించాల్సి ఉండగా, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డ్రా కార్యక్రమాన్ని ఉన్నతాధికారులు వాయిదా వేశారు. తదుపరి తేదీలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. నూజివీడులోని మద్యం దుకాణానికి 36, ఆగిరిపల్లిలో 20, చాట్రాయి మండలంలో 13, ముసునూరు మండలంలో 9 అర్జీలు దాఖలైనట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తుదారులు గ్రహించాలి : ఎక్సైజ్ సీఐ

కైకలూరు : కైకలూరు నియోజకవర్గంలోని మండవల్లి మండలంలో కల్లుగీత కులాల మద్యం షాపు డ్రా వాయిదా పడినట్టు ఎక్సైజ్ సీఐ షేక్ రమేష్ తెలిపారు. సోమవారం కలెక్టర్ సమక్షంలో ఈ మద్యం దుకాణాలకు డ్రా తీయాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కల్లుగీత కులాల షాపుకు లాటరీలో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్న వారంతా ఈ విషయాన్ని గ్రహించాలన్నారు.



నాటకాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

నూజివీడులో ఆకట్టుకున్న నాటకోత్సవాలు

నూజివీడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : నూజివీడులో నిర్వహించిన నాటకోత్సవాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం గంగోత్రిసాయి దర్శకత్వంలో తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో విడాకులు కావాలి సాంఘిక నాటిక కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించగా ఆహుతులను ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో కళలు అడుగంటి పోయాయని, గత ప్రభుత్వంలో కళా సాంస్కృతిక వైభవం క్షీణించిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నూజివీడు పట్టణానికి చెందిన ప్రము ఖులు హాజరై, నాటక మహోత్సవాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపల్ మోహన్, లయన్స్ క్లబ్ సభ్యులు కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దుగ్గిరాల బాలరావమ్మ తిరునాళ్లు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆగిరిపల్లి, తోటపల్లి, కనసానపల్లి గ్రామాల్లో కొలువైన శ్రీదుగ్గిరాల బాలరావమ్మతల్లి తిరునాళ్లు 10,11,12 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ మెంబర్స్, గ్రామ పెద్దలు తెలిపారు. మండలంలోని మూడు గ్రామాల్లో జరిగే తిరునాళ్ళకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు నిర్వాహించినట్టు తెలిపారు. తిరునాళ్ళలో భాగంగా తోటపల్లిలో మొదటిరోజు పల్లకీ సేవ, రెండో రోజు గ్రామంలో ఊరేగింపు, మూడో రోజు పాలుపొంగళ్ళు, కుంకుమార్చన, ఉయ్యాల సేవలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి సిహెచ్ సాయి తెలిపారు.



అలంకరణలో బాలరావమ్మ

బీజేపీ సంబరాలు

చాట్రాయి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించడంతో మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా ఆధ్వర్యంలో ఆదివారం చాట్రాయి,పోలవరం, కృష్ణారావుపాలెం గ్రామాల్లో కూటమి శ్రేణులు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సంజీవరెడ్డి,మల్లిఖార్జున రావు, చెన్నారావు, శ్రీకర్, ఊట్ల ధనలక్ష్మి, కోటేశ్వరరావు, చాగంటి వాసుదేవరావు పాల్గొన్నారు.



పోలవరంలో బీజేపీ నాయకుల సంబరాల